

లొంగే ప్రసక్తే లేదు

- అమెరికా జోక్యం చేసుకుంటే కోలుకోలేని నష్టం తప్పదు
- ఇజ్రాయెల్ పెద్ద తప్పు చేసింది
- దాడి చేసి తప్పించుకొని పారిపోయే శకం ముగిసింది
- నేరానికి పాల్పడిన యూదు పాలకులను కఠినంగా శిక్షిస్తాం
- ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ

దుబాయ్, జూన్ 18: ఇజ్రాయెల్ భీకర దాడుల నేపథ్యంలో లొంగిపోవాలంటూ అమెరికా ఇచ్చిన పిలుపును ఇరాన్ సుప్రీం నాయకుడు అయాతొల్లా అలీ ఖమేనీ బుధవారం నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. అమెరికా ఏ విధంగా జోక్యం చేసుకున్నా వారికి కోలుకోలేనంత నష్టం జరుగుతుందని ఇరాన్ ప్రభుత్వ టీవీలో ముందుగా రికార్డు చేసి ప్రసారం చేసిన ఓ వీడియోలో ఖమేనీ హెచ్చరించారు. గత శుక్రవారం ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఘర్షణలు ప్రారంభమైన తర్వాత ప్రజల ముందుకు ఖమేనీ రావడం ఇది రెండవసారి. ఖమేనీ ఎక్కడ దాక్కున్నారో తమకు తెలుసునని, ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలు చేసిన నేపథ్యంలో ఖమేనీ ఘాటుగా స్పందించారు. ట్రంప్ చేసిన హెచ్చరికలను తోసిపుచ్చిన ఖమేనీ ఆయనవి అసందర్భ ప్రేలాపనలుగా అభివర్ణించారు. 'ఇరాన్ గురించి, ఆ దేశ ప్రజల గురించి, దాని చరిత్ర గురించి తెలిసిన ఆలోచనాపరులెవరూ ఈ విధమైన హెచ్చరికల భాషను ఉపయోగించరు. ఎందుకంటే ఇరానియన్ దేశం ఎన్నటికీ లొంగే ప్రసక్తి లేదు' అని ఖమేనీ స్పష్టం చేశారు. అమెరికా సైనిక జోక్యానికి పాల్పడితే వారికి తీరని నష్టం వాటిల్లుతుందన్న విషయం అమెరికన్లు తెలుసుకోవాలని ఆయన హెచ్చరించారు. భారీ తప్పిదానికి పాల్పడిన ఇజ్రాయెల్‌ను శిక్షిస్తామని ఖమేనీ హెచ్చరించారు. దాడి చేసి తప్పించుకుని పారిపోయే యుగం ముగిసిపోయిందని, నేరానికి పాల్పడిన 'యూదు పాలకులను' శిక్షిస్తామని ఆయన చెప్పారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ సైనిక దాడులు సాగిస్తున్న వేళ అత్యంత సాహసోపేతంగా, సకాలంలో స్పందిస్తున్న ఇరానియన్ జాతిని ఆయన ప్రశంసించారు. తమపై బలవంతంగా రుద్దిన యుద్ధాన్ని, అశాంతిని ఇరానియన్ జాతి ధైర్యంగా ఎదుర్కొంటుందని, ఎవరికీ లొంగే ప్రసక్తి లేదని ఖమేనీ ప్రకటించారు.

ఇరాన్‌తో చర్చల్లేవ్

నాయకత్వ మార్పు అనివార్యం.. ఇజ్రాయెల్ మంత్రుల వ్యాఖ్యలు

జెరూసలెం: ఇరాన్‌తో చర్చలు జరిపే ప్రసక్తి లేదని ఇజ్రాయెల్ మంత్రులు బుధవారం స్పష్టం చేశారు. ఆశించిన లక్ష్యాలను సాధించే వరకు ఇరాన్‌పై తాము ప్రారంభించిన ఆపరేషన్ రైజింగ్ లయన్ కొనసాగుతుందని వారు ప్రకటించారు. ఇస్లామిక్ దేశమైన ఇరాన్‌లో నాయకత్వ మార్పు జరిగే అవకాశం ఉందని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ సోషల్ మీడియా వేదిక ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. "టెహ్రాన్‌పై నుంచి పెనుగాలులు వీచాయి. ప్రసార మాధ్యమం నుంచి ఇతర లక్ష్యాల దాకా ప్రభుత్వ చిహ్నాలపై బాంబులు పడి అవి ధ్వంసమయ్యాయి. ప్రజలు భయాందోళనతో పరుగులు తీస్తున్నారు. నియంతృత్వాలు ఇలాగే కుప్పకూలిపోతాయి" అంటూ కట్జ్ తన పోస్టులో రాశారు. ఇరాన్‌తో ఎటువంటి సంప్రదింపులు ఉండవని ఇజ్రాయెల్ విదేశీ వ్యవహారాల మంత్రి గిడియాన్ సార్ విదేశీ రాయబారుల వద్ద ప్రకటించారు. టెల్ అవీవ్ సమీపంలో ఆదివారం ఇరాన్ జరిపిన బాలిస్టిక్ క్షిపణి దాడిలో 9 మంది పౌరులు మరణించిన బాట్ యామ్ ప్రాంతాన్ని ఆయన విదేశీ రాయబారులతో కలసి సందర్శించారు. తమ లక్ష్యాలను సాధించే వరకు ఈ ఆపరేషన్ కొనసాగుతుందని ఆయన చెప్పారు. జనావాస కేంద్రాలపై ఇరాన్ పాలకులు ఉద్దేశపూర్వకంగా దాడులు చేసి పౌరులను హతమారుస్తున్నారని ఆయన అన్నారు. వారు తప్పు చేస్తున్నారని, ఇజ్రాయెల్ ప్రజలు వివేకవంతులని, ఆపరేషన్ రైజింగ్ లయన్‌ని వారు బలపరుస్తారన్న విషయం ఇరాన్‌కు అర్థం కావడం లేదని సార్ వ్యాఖ్యానించారు. భారత్‌తో సహా 30 దేశాలకు పైగా రాయబారులు క్షిపణి దాడి జరిగిన ప్రదేశం వద్ద సమావేశమయ్యారు. వారికి ఇజ్రాయెల్ వైఖరిని ఆయన వివరించారు. అంతకుముందు అదే ప్రదేశంలో విలేకరుల సమావేశంలో విదేశీ వ్యవహారాల మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం ఎదురవుతున్న ముప్పు తొలగించడానికి జరుగుతున్న ఈ ఆపరేషన్ లక్ష్యాలను సాధించగలమన్న విశ్వాసం తమకు పూర్తిగా ఉందని చెప్పారు. తమ లక్ష్యాలను సాధించే వరకు ఈ ఆపరేషన్ కొనసాగుతుందని ఆయన పునరుద్ఘాటించారు.

వణుకుతున్న టెహ్రాన్

ప్రాణ భయంతో ప్రజల వలసలు.. మెట్రో స్టేషన్లలో తలదాచుకుంటున్న వైనం

వీధులు నిర్మానుష్యం.. దుకాణాలు మూసివేత

బుధవారం టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ బాంబు దాడులతో వెలువడుతున్న పొగ

న్యూయార్క్, జూన్ 18: ఇరాన్ రాజధాని టెహ్రాన్ వీధులు నిర్మానుష్యంగా మారాయి. వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. కమ్యూనికేషన్ వ్యవస్థ స్తంభించిపోయింది. బాంబుల నుంచి రక్షణ కల్పించే వ్యవస్థలు సామాన్య పౌరులకు లేవు. దీంతో బాంబు దాడులకు భీతిల్లుతున్న టెహ్రాన్ పౌరులు మెట్రో స్టేషన్లలో నేలపైన పడుకుని బాంబుల మోతలు వింటూ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఇరాన్‌లోని అణు కార్యక్రమాన్ని, సైనిక స్థావరాలను ధ్వంసం చేయాలని కంకణం కట్టుకున్న ఇజ్రాయెల్ టెహ్రాన్ గగనతలం తమ అధీనంలోకి వచ్చిందని చేసిన ప్రకటనతో భయాందోళన చెందుతన్న టెహ్రాన్ ప్రజలు.. ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు ఏ క్షణాన తమపైన బాంబుల వర్షం కురిపిస్తాయోనని ప్రాణాలు ఉగ్గబెట్టుకున్నారు. టెహ్రాన్‌లో నివసించే కోటి మంది ప్రజలు వెంటనే నగరాన్ని విడిచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం హెచ్చరించడంతో వేలాది మంది ప్రజలు నగర శివార్ల వైపు పరుగులు తీశారు. కొందరైతే కాస్పియన్ సముద్రం వైపు మరి కొందరైతే అర్మేనియా, తుర్కియేకు కూడా తరలిపోయారు. అయితే బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్లలో నివసించే వృద్ధులు, వ్యాధిగ్రస్తులు తమ ఆప్తుల వెంట వెళ్లలేకపోవడంతో అక్కడే ఉంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నారని ఓ మానవ హక్కుల గ్రూపు పేర్కొంది.

స్థానిక మీడియా మూసివేత

బాంబు దాడులకు తామే లక్ష్యంగా మారిపోవడంతో స్థానిక మీడియా వార్తా సేకరణ, ప్రసారాన్ని నిలిపివేసింది. దీంతో బయట ఏం జరుగుతోందో తెలియని పరిస్థితుల్లో టెహ్రాన్ పౌరులు జీవిస్తున్నారు. వీధుల్లో కనిపించే పోలీసులు రక్షణ కవచాలు ధరిస్తుండగా సైరన్లు వినిపిస్తే తక్షణమే ఎలా స్పందించాలో ప్రజలకు అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. తన కుటుంబానికి లేదా స్నేహితులకు పంపే ప్రతి సందేశం ఇదే చివరిదవుతుందన్న భావన ఇటీవలి రోజుల్లో కలుగుతోందని 49 ఏళ్ల షిరిన్ తెలిపారు. రేపు తాము బతికి ఉంటామో లేదో తెలియడం లేదని ఆమె చెప్పారు.

ఇరాన్ సెంట్రీఫ్యూజ్ కేంద్రాలు ధ్వంసం

దుబాయ్, జూన్ 18: ఇరాన్‌లోని యురేనియం సెంట్రీఫ్యూజ్ తయారుచేసే రెండు కేంద్రాలతోపాటు క్షిపణి విడిభాగాలు, ఆయుధాలు తయారుచేసే ఫ్యాక్టరీలపైన ఇజ్రాయెల్ మంగళవారం రాత్రి దాడులు జరిపి ధ్వంసం చేసిందని ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ(ఐఏఈఏ) తెలిపింది. 50కిపైగా యుద్ధ విమానాలు ఈ దాడులలో పాల్గొన్నట్లు సంస్థ వెల్లడించింది. అణ్వస్త్రాల కోసం ఇరాన్ యురేనియం శుద్ధి సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ సెంట్రీఫ్యూజ్ ఉపయోగపడుతుందని ఇజ్రాయెలీ రక్షణ దళాలు(ఐడీఎఫ్) వెల్లడించాయి.

ఖమేనీ దాక్కుని ఉన్న బంకర్‌పై దాడి?

ఇరాన్ చీఫ్ ఆయతొల్లా ఖమేనీ దాక్కుని ఉన్న ఒక బంకర్‌పై ఇజ్రాయెల్ దాడి చేసింది. ఆయన టెహ్రాన్‌లోని లావిజన్ పౌరుగు ప్రాంతంలో ఒక రహస్య బంకర్‌లో దాగి ఉన్నారన్న సమాచారం మేరకు ఇజ్రాయెల్ వైమానిక దళాలు బుధవారం ఈ దాడులు జరిపాయి. అయితే ఇజ్రాయెల్ అధికారులు ఈ విషయాన్ని ధ్రువీకరించలేదు. ఇరాన్ కూడా ఈ వార్తలను ఖండించింది.

ఇజ్రాయెల్‌పై హైపర్‌సానిక్ క్షిపణులు

- టెల్ అవీవ్‌పై ఫతా-1ని ప్రయోగించిన ఇరాన్
- పలు భవనాలు, టవర్లు ధ్వంసం



టెల్ అవీవ్‌పై ఇరాన్ క్షిపణి దాడుల్ని అడ్డుకుంటున్న ఇజ్రెయెల్ క్షిపణి రక్షణ వ్యవస్థ

దుబాయ్, జూన్ 18: ఇజ్రాయెలీ నగరాలపై ఇరాన్ క్షిపణి దాడులు వరుసగా ఆరో రోజూ కొనసాగాయి. తమ దేశంలోని అణు, సైనిక స్థావరాలపై జరిగిన దాడులకు ప్రతీకారంగా ఇజ్రాయెల్‌పై హైపర్‌సానిక్ క్షిపణులను ప్రయోగించినట్టు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. ఇజ్రాయెల్‌పై 'ఆపరేషన్ ఆనెస్ట్ ప్రామిస్-3'లో భాగంగా 11వ దశలో 'ఫతా-1' క్షిపణులను ఉపయోగించామని, ఆక్రమిత భూభాగాల గగనతలంపై ఇరాన్ దళాలు పూర్తి నియంత్రణ సాధించాయని ఐఆర్‌జీసీ వెల్లడించింది. బుధవారం ఉదయం ఇరాన్ క్షిపణి దాడిలో సెంట్రల్ ఇజ్రాయెల్‌లో మంటలు చెలరేగి అనేక కార్లు దగ్ధమైనట్లు ఇరాన్‌కు చెందిన ఫార్స్ వార్తా సంస్థ తెలిపింది. మెరోన్ ఎయిర్‌బేస్‌ని లక్ష్యంగా చేసుకుని ఇరాన్ క్షిపణి దాడులు జరిపింది. దేశవ్యాప్తంగా జరిగిన ఇరాన్ క్షిపణి దాడులలో ఆస్తి, ప్రాణ నష్టం సంభవించినట్లు ఇజ్రాయెలీ మీడియా తెలిపింది. అయితే యుద్ధ సమయంలో విధించిన సైనిక సెన్సార్‌షిప్ కారణంగా సున్నితమైన లేదా వ్యూహాత్మక లక్ష్యాలకు సంబంధించిన దాడులపై వార్తలను ప్రచురించడం నిషిద్ధం.

భవనాలు ధ్వంసం

సామాజిక మాధ్యమాలలో ప్రత్యక్షమవుతున్న ఫొటోలు, వీడియోలను, నిఘా వర్గాల సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ధ్వంసమైన ప్రదేశాలను గుర్తించి మీడియా వార్తలను అందచేస్తున్నది. గత శనివారం టెల్ అవీవ్‌లోని రక్షణ మంత్రిత్వశాఖ కేంద్రకార్యాలయానికి అత్యంత సమీపంలో ఇరాన్ క్షిపణులు విరుచుకుపడ్డాయి. ఇజ్రాయెల్ పెంటగాన్‌గా వ్యవహరించే ఈ ప్రదేశంలో అనేక ప్రభుత్వ కార్యాలయాలు, కీలక సైనిక నిఘా విభాగ కార్యాలయాలు ఉన్నాయి. టెల్ అవీవ్‌లోని అనేక ప్రాంతాలపై కూడా ఇరాన్ క్షిపణి దాడులు జరిగాయి. టెల్ అవీవ్‌కు పొరుగున ఉన్న రమాత్ గన్ నగరంలోని అనేక టవర్లు, నివాస సముదాయాలపై ఇరాన్ క్షిపణులు దాడి చేయడంతో భారీ నష్టం వాటిల్లినట్లు అల్ జజీరా తెలిపింది. తొమ్మిది భవనాలు ధ్వంసమైనట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. పేటా టిక్వా నగరంపై కూడా ఇరాన్ క్షిపణులు దాడి చేశాయి. ఈ దాడులలో నివాస, వాణిజ్య భవనాలు ధ్వంసమయ్యాయి. బూనీ బ్రాక్‌లో మతపరమైన పాఠశాల ధ్వంసమైనట్లు అల్ జజీరా పేర్కొంది. ఇరాన్ దాడులలో 9 మంది మరణించగా 200 మంది వరకు గాయపడినట్లు ఇజ్రాయెల్ అధికారికంగా ధ్రువీకరించింది. రిషాన్ లెజియాన్‌లో అనేక ఇళ్లు ధ్వంసం కాగా అపార నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. ఉత్తర ఇజ్రాయెల్‌లోని దేశంలోనే అతిపెద్ద చమురు రిఫైనరీ హైఫా బజాన్ పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌పై ఇరాన్ క్షిపణులు దాడి చేశాయి. దీంతో కర్మాగారం మూతపడింది.

ఏమిటీ ఫతా-1?

ఇది ఇరాన్ తొలి హైపర్‌సోనిక్ క్షిపణి. ఇజ్రాయెల్ వద్ద ఉన్న ఐరన్ డోమ్, యారో లాంటి అత్యాధునిక క్షిపణి రక్షణ వ్యవస్థలను సైతం ఇది ఛేదించుకుని వెళ్లగలదు. 12 మీటర్ల పొడవు ఉండే ఈ క్షిపణి దాదాపు 1,400 కి.మీ. పరిధిలోని లక్ష్యాలను ఛేదించగలదు. సింగిల్-స్టేజ్ ప్రొపల్షన్ వ్యవస్థను ఉపయోగించుని ఘన ఇంధనంతో నడిచే ఈ క్షిపణి 200 కిలోల పేలుడు పదార్థాలను మోసుకెళ్లగలదు. హైపర్‌సానిక్ గ్లైడ్ వెహికల్ (హెచ్‌జీవీ) వార్‌హెడ్‌తో శత్రు దేశాల రక్షణ వ్యవస్థలను తప్పించుకోగలిగేలా రూపొందించిన ఫతా-1 గంటకు 17,900 కి.మీ. వేగంతో ప్రయాణించగలదు.

నేనేం చేస్తానో ఎవరికీ తెలియదు

ఇరాన్‌తో యుద్ధంపై ట్రంప్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, జూన్ 18: ఇరాన్‌పై ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులలో అమెరికా పాల్గొనడంపై వ్యాఖ్యానించడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిరాకరించారు. "ఇజ్రాయెల్‌తో నేను చేతులు కలపొచ్చు.. కలపక పోవచ్చు. నేనేం చేయదలచుకున్నానో ఎవరికీ తెలియదు" అని బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్‌తో చర్చలు జరిపేందుకు సమయం మించిపోయిందని ఆయన అన్నారు. ఇరాన్‌పై చర్యలు అనివార్యమని ఆయన సూచనప్రాయంగా వెల్లడించారు. వచ్చే వారం.. వారం లోపలే చాలా పెద్ద పరిణామం ఉంటుంది అని ఆయన వ్యాఖ్యానించారు. వైట్ హౌస్‌లో చర్చలు జరిపేందుకు ఇరాన్ నుంచి ప్రతిపాదన వచ్చిందని ట్రంప్ ధ్రువీకరించారు. అయితే ఇరాన్ నుంచి ఈ ప్రతిపాదన ఎప్పుడు వచ్చిందో ఆయన వివరించలేదు. "ఇరాన్‌కు పూర్తిగా రక్షణ వ్యవస్థ లేదు. గగనతల రక్షణ వ్యవస్థ అంటూ ఏదీ లేదు" అని ఆయన తెలిపారు. ఇరాన్‌పై దాడిని కొనసాగించవలసిందిగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు చెప్పినట్లు పరోక్షంగా వెల్లడిస్తూ "ముందుకు సాగండి" అని తాను అన్నట్లు ట్రంప్ చెప్పారు.

జగిత్యాల వాసి ఇజ్రాయెల్‌లో మృతి

జగిత్యాల, జూన్ 18 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని 36వ వార్డుకు చెందిన రేవెల్ల రవీందర్(55) సోమవారం ఇజ్రాయెల్ దేశంలో గుండెపోటుతో మృతిచెందగా, ఆలస్యంగా తెలిసింది. రవీందర్ ఉపాధి కోసం ఇజ్రాయెల్‌కు రెండేళ్ల క్రితం వెళ్లాడు. ప్రస్తుతం ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం జరుగుతుండడంతో ఇజ్రాయెల్‌లోని ప్రజలందరినీ బంకర్‌లలోకి తీసుకెళ్లి ఉంచారు. ఇరాన్ మిస్సైల్ బంకర్ పక్కనే పడడంతో ఆ భారీ శబ్దానికి రవీందర్ మృత్యువాత పడ్డాడని బంధువులు తెలిపారు. రవీందర్‌కు భార్య విజయలక్ష్మి, కూతురు ఆకాంక్ష, కొడుకు మంజునాథ్ ఉన్నారు. కూతురు పెళ్లి కాగా, కొడుకు బధిరుడని స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని త్వరగా ఇండియాకు తెప్పించడానికి ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్ కుమార్, ఎన్ఆర్ఐ అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి దృష్టికి తీసికెళ్లినట్లు మున్సిపల్ మాజీ వైస్ పర్సన్ అడువాల జ్యోతి పేర్కొన్నారు. ఇండియన్ ఎంబసీ సహకారంతో మృతదేహాన్ని త్వరగా ఇండియాకు రప్పిస్తామని వారు హామీ ఇచ్చారన్నారు.

ఇరాన్‌లో ఇంటర్నెట్ సేవలు బంద్

వాట్సాప్ డిలీట్ చేయాలని పౌరులకు సూచన

టెహ్రాన్, జూన్ 18: ఇజ్రాయెల్‌తో యుద్ధం కారణంగా ఇరాన్‌లో మంగళవారం దాదాపు పూర్తిగా ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. ఇజ్రాయెల్ సైబర్ దాడుల నేపథ్యంలో వీపీఎన్‌లు, యాప్‌స్టోర్‌లు, ప్రధాన మెసేజింగ్ యాప్‌ల సేవలను పరిమితం చేశారు. దీంతో యుద్ధం వేళ ఇరాన్‌తో ప్రపంచ దేశాలకు కమ్యూనికేషన్ సౌకర్యాలను ఆ దేశం పరిమితం చేసింది. 2019లో కూడా ఇరాన్ వరుసగా ఆరు రోజుల పాటు ఇంటర్నెట్ సేవలను నిలిపివేసింది. కొత్త యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోకుండా ఇరాన్ ప్రభుత్వం ఇటీవల గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్‌లపై కూడా ఆంక్షలు విధించింది. కాగా, మెసేజింగ్, కాలింగ్ యాప్ వాట్సాప్‌ను తమ స్మార్ట్ ఫోన్ల నుంచి తొలగించాలంటూ ఇరాన్ ప్రభుత్వం మంగళవారం తమ పౌరులకు విజ్ఞప్తి చేసింది.

ఇరాన్‌లో 585 మంది మృతి

ప్రకటించిన మానవ హక్కుల సంస్థ

దుబాయ్, జూన్ 18: ఇరాన్‌పై ఇజ్రాయెల్ తన దాడులను మరింత తీవ్రతరం చేసింది. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు టెహ్రాన్‌లో 585 మంది మరణించగా, 1,326 మంది గాయపడ్డారని వాషింగ్టన్ కేంద్రంగా పనిచేసే మానవ హక్కుల సంస్థ వెల్లడించింది. మరణించిన వారిలో 239 మంది పౌరులు, 120 మంది భద్రతా దళాలకు చెందిన వారు ఉన్నట్టు తెలిపింది. ఇజ్రాయెల్‌పై ఇరాన్ 400 క్షిపణులు, వందలాది డ్రోన్‌లు ప్రయోగించగా, ఇప్పటివరకు 24 మంది మరణించగా, వందలాది మంది గాయపడ్డారు.

ఒక్క రాత్రికి రూ.2,400 కోట్లు!

ఇరాన్ క్షిపణులను అడ్డుకునేందుకు ఇజ్రాయెల్ వెచ్చిస్తున్న మొత్తమిది

10-12 రోజులకు సరిపడానే

న్యూఢిల్లీ, జూన్ 18: ఇరాన్ సైనిక మౌలిక సదుపాయాలను విజయవంతంగా ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ చెప్పుకుంటున్నప్పటికీ సుదూర లక్ష్యాలను ఛేదించే క్షిపణులను అడ్డుకునే వ్యవస్థ క్రమంగా బలహీనపడుతున్నది. దీంతో ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారినట్లు అమెరికా అధికారి ఒకరిని ఉటంకిస్తూ వాల్ స్ట్రీట్ జర్నల్ వెల్లడించింది. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య నిర్విరామంగా క్షిపణుల దాడి కొనసాగుతున్న నేపథ్యంలో ఈ వార్తకు ప్రాధాన్యం ఏర్పడింది. గత శుక్రవారం ఇజ్రాయెల్ ఇరాన్‌పై రైజింగ్ లయన్ ఆపరేషన్‌ని మొదలుపెట్టిన నాటి నుంచి ఇజ్రాయెల్ భూభాగంలోకి చొచ్చుకుపోయే సామర్థ్యం ఉన్న దాదాపు 400 బాలిస్టిక్ క్షిపణులను ఇరాన్ ప్రయోగించింది. ఇలాంటి క్షిపణులు ఇరాన్ వద్ద 2,000 వకు ఉన్నట్లు అంచనా. కాగా, భూమి నుంచి చాలా ఎత్తులో వెళ్లే ఈ క్షిపణులను అడ్డుకోవడం కోసమే డిజైన్ చేసిన యారో వ్యవస్థ ఇరాన్ పేల్చిన క్షిపణులలో చాలా వాటిని అడ్డుకోగలిగినప్పటికీ చాలా శ్రమపడాల్సి వచ్చింది. ఇరాన్ పేల్చిన క్షిపణులలో మూడింట ఒక వంతు క్షిపణులను మాత్రమే ఇజ్రాయెల్ ధ్వంసం చేసిందని, అయితే ఇరాన్ గగనతలంపై ఆధిపత్యాన్ని ఇజ్రాయెల్ సంపాదించుకోగలిగిందని టెల్ అవీవ్‌లోని అధికారులు వాల్ స్ట్రీట్ జర్నల్‌కి తెలిపారు. అయితే ఇరాన్ అమ్ముల పొదిలో సగానికి పైగా క్షిపణులు ఇంకా ఉన్నాయని, వాటిని భూగర్భ స్థావరాలలో దాచి ఉండ వచ్చని ఇజ్రాయెల్ నిఘా వర్గాలు తెలిపాయి. ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థ ఎంత పటిష్టమైనదైనప్పటికీ దాని నిర్వహణ తలకు మించిన భారంగా మారింది. ఐరన్ డోమ్, డేవిడ్స్ స్లింగ్, యారో సిస్టమ్, అమెరికా సరఫరా చేసే ప్యాట్రియట్స్, థాడ్ బ్యాటరీలతో కూడిన ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థ వ్యయం ఆ దేశాన్ని కలవరపెడుతున్నది. రక్షణ కార్యకలాపాల కోసం ఒక్క రోజు రాత్రికి అయ్యే ఖర్చు 28.5 కోట్ల డాలర్లు (రూ.2,400 కోట్లు)గా ఇజ్రాయెల్ నుంచి వెలువడే ఫైనాన్షియల్ డైలీ ది మార్కర్ అంచనా వేసింది. క్షిపణులను అడ్డుకునే యారో సిస్టమ్ ఒక్కోటి 30 లక్షల డాలర్లని (రూ. 25.94 కోట్లు) పత్రిక తెలిపింది.

ఇరాన్‌లో చిక్కుకున్న వారి కోసం 'ఆపరేషన్ సింధు'

న్యూఢిల్లీ : ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య పరస్పర దాడులు తీవ్రమవుతుండటంతో ఇరాన్‌లోని భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చేందుకు భారత ప్రభుత్వం 'ఆపరేషన్ సింధు'ను ప్రారంభించింది. ఉత్తర ఇరాన్ నుంచి 110 మంది భారతీయ విద్యార్థులను తీసుకొస్తున్నది. వీరిలో 90 మంది జమ్ముకశ్మీరుకు చెందినవారు. వీరంతా మంగళవారం అర్మేనియాలోని యెరవాన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి బుధవారం మధ్యాహ్నం 2.55 గంటలకు ప్రత్యేక విమానంలో న్యూఢిల్లీకి తీసుకొస్తున్నారు. ఈ విమానం గురువారం తెల్లవారుజామున న్యూఢిల్లీకి చేరుకుంటుంది. వీరిని సురక్షితంగా భారత దేశానికి తీసుకొచ్చేందుకు సహకరించినందుకు ఇరాన్, అర్మేనియాకు విదేశాంగ శాఖ ధన్యవాదాలు తెలిపింది.

ఖమేనీ వారసుడెవరు?

భీకరంగా తలపడుతున్న ఇజ్రాయెల్-ఇరాన్ ▪ ఖమేనీని అంతమొందించడమే ఇజ్రాయెల్ లక్ష్యం

ఖమేనీ వారసులుగా తెరపైకి పలువురి పేర్లు ▪ మొదటి వరుసలో ఆయన రెండో కుమారుడు మొజ్తాబా

న్యూఢిల్లీ: ఇజ్రాయెల్‌తో ఢీ అంటే ఢీ అంటున్న ఇరాన్ తగ్గేదేలేదని సంకేతాలిస్తున్నది. ఆ దేశంతో తాడోపేడో తేల్చుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నది. అమ్ములపొది నుంచి అత్యాధునిక ఆయుధాలను బయటకు తీస్తున్నది. మరోవైపు, ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ మాత్రం జాడ లేకుండా పోయారు. ఆయన బంకర్‌లోకి వెళ్లిపోయినట్టు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. మరోవైపు, ఆయన ఎక్కడున్నారో తమకు తెలుసని, కానీ ప్రస్తుతానికి ఆయనకు హాని తలపెట్టబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్తున్నారు. అయితే, ఆయనను అంతమొందించాలని ఇజ్రాయెల్ గట్టి పట్టుదలగా ఉన్నది. ఆయన మరణిస్తే తప్ప ఇరు దేశాల మధ్య రాజుకున్న ఉద్రిక్తతలకు తెరపడవని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తేల్చి చెప్పారు. ఇరాక్ మాజీ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్‌కు పట్టిన గతే ఖమేనీకి కూడా పడుతుందని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ హెచ్చరించారు. ఒకవేళ ఈ యుద్ధంలో ఖమేనీ మరణిస్తే ఇరాన్ తదుపరి సుప్రీం లీడర్ ఎవరన్న చర్చ జరుగుతున్నది. ఈ నేపథ్యంలో పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి.

మొజ్తాబా

మొజ్తాబా ఖమేనీ

ఈయన అయతొల్లా ఖమేనీ రెండో కుమారుడు. ఈ రేసులో ముందువరుసలో ఉన్నది ఆయనే. 1969లో జన్మించిన మొజ్తాబాకు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్‌తోపాటు ఇరాన్ మతాధికారులతోనూ సత్సంబంధాలున్నాయి. ఇరాన్-ఇరాక్ యుద్ధం చివరి దశలో ఆయన పనిచేశారు. ఇప్పుడు తెరవెనక బలమైన ప్రభావం కలిగిన మధ్యస్థ స్థాయి మతాధికారి.

అలీరెజా అరాఫీ

ఈ రేసులో వినిపిస్తున్న మరో పేరు అలీరెజా అరాఫీ. ఖమేనీకి నమ్మినబంటు. నిపుణుల అసెంబ్లీకి ఆయన డిప్యూటీ చైర్మన్‌గా, గార్డియన్ కౌన్సిల్ సభ్యుడిగా, కోమ్‌లో శుక్రవారం ప్రార్థనల లీడర్‌గా ఇలా పలు కీలక పదవుల్లో ఉన్నారు. ఇరాన్ అధికార నిర్మాణంలో ఆయనుకున్న విస్తృతమై అధికారాలు ఆయనను ఈ రేసులో నిలబెట్టాయి.

అలీ అస్ఘర్ హెజాజీ

సుప్రీం లీడర్ ఖమేనీ కార్యాలయంలో అలీ అస్ఘర్ రాజకీయ భద్రతా వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు. ఇరాన్ నిఘా యంత్రాంగంలో చాలా కాలం పాటు పాలు పంచుకున్నాడు. వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడంలో ఆయన దిట్ట.

ఘోలమ్ హోస్సేన్ మోసేనీ ఎజీ

ఖమేనీ వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలనుకుంటున్న వారిలో ఘోలమ్ కూడా ఉన్నారు. న్యాయ, నిఘా వ్యవస్థలో ఆయన దశాబ్దాలపాటు సేవలు అందించారు. అధ్యక్షుడు మహమూద్ అహ్మదీనెజాద్ నేతృత్వంలోని ప్రభుత్వంలో ఆయన ఇంటెలిజెన్స్ మంత్రిగా పనిచేశారు. అలాగే, అటార్నీ జనరల్, న్యాయవ్యవస్థ ప్రతినిధిగా కూడా పనిచేశారు.

రెండున్నర దశాబ్దాలుగా ఖమేనీ

వార్తల్లో వ్యక్తిగా నిలిచిన ఇరాన్ ప్రస్తుత సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ 1989లో అయతొల్లా రుహొల్లా వారసుడిగా అధికారం చేపట్టారు. రెండున్నర దశాబ్దాలుగా ఆయన ఇనుప పిడికిళ్లతో ఇరాన్‌ను పాలిస్తున్నారు. ఇరాన్